చదువు

హైదరాబాద్

ఈనాడు మంగళవారం జనవరి 30, 2018 10

■ e-mail: edc@eenadu.in



తల్లిదండ్రుల బలవంతంతో ఇష్టంలేని గ్రూప్ తీసుకున్నా.. అందమైన ఆకర్షణల మధ్య సర్దుకున్నాడు సతీశ్. ప్రణాళిక లేకుండా చదవడంతో రివిజన్ విషయం పట్టించుకోలేదు. అన్నీ వచ్చేసినట్లే ఉన్నా ఏదీ గుర్తుకు రావడం లేదని ఆందోళన చెందడం మొదలుపెట్టాడు. అర్ధరాత్రి దాటినా నిద్రపట్టదు. పగలు కునుకులేస్తున్నాడు. అంతా అయోమయంగా ఉంది. ఇవన్నీ ఒత్తిడి లక్షణాలు. వీటిని సరైన సమయంలో గుర్తించి సానుకూల దృక్పథంతో వ్యవహరించకపోతే పరిస్థితి ప్రతికూలంగా మారిపోతుంది.

పరీక్షల ఒత్తిడిని ఓడిద్దాం!

శ్రద్ధగానే చదువుతున్నా విద్యార్థులందరిలోనూ అలాంటి పరిస్థితే ఎంతోకొంత కనిపిస్తుంటుంది. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలూ, ఎంసెట్, నీట్, జేఈఈ, ఇంకా డీమ్‌డ్ యూనివర్సిటీల ప్రవేశపరీక్షల కోసం సిద్ధమయ్యేవారూ, డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులూ ఓ పక్క ప్రిపరేషన్లో మునిగిపోతూ మరో పక్క పరీక్షల ఆలోచనల ఒత్తిడితో సతమతమవుతుంటారు. ఈ ఒత్తిడి మితిమీరకుండా చూసుకోవటం చాలా ముఖ్యం. పరీక్షలు బాగా రాసి, ఆశించిన మార్కులు తెచ్చుకోవాలంటే ఇది తప్పనిసరి.

సుజాత వేల్పూరి
ఎడ్యుకేషన్ కౌన్సెలర్

తలనొప్పి, ఆహారం జీర్ణం కాకపోవడం, వాంతి అయ్యేలా ఉండటం, ఎక్కువ తినెయ్యటం, నిద్రలేమి, అలసట..ఇవన్నీ ఒత్తిడిని సూచించే లక్షణాలు. మానసికంగా చూస్తే... కోపం, అసహనం, నిరాశ, ఆత్మవిశ్వాసం లేకపోవటం, మూడ్ తరచూ మారిపోతుండటం లాంటివి గమనించవచ్చు.

పరీక్షల ఒత్తిడి, దానివల్ల ఏర్పడే భయాలకు కొన్ని మూల కారణాలుంటాయి. వాటిని మొదట అర్థం చేసుకోవాలి. ఆపై కొన్ని సులభమార్గాలతో అధిగమించవచ్చు.

జ్ఞాపకశక్తి లోపం

చాలామంది విద్యార్థులు ఎంత చదివినా, చదివిందేదీ గుర్తుండటం లేదని బాధపడుతుంటారు. నిజానికి వీళ్లు పరీక్షలు బాగానే రాస్తారు. కానీ ఎంత చదివినా గుర్తు ఉండకపోవడమనేది పరీక్షల ముందు రోజుల్లో ఎదురయ్యే భయం.

పాఠ్యాంశాన్ని అర్థం చేసుకుని 'నేర్చుకునే పద్ధతి' (లెర్నింగ్ మోడ్)లో చదివితే మర్చిపోవడం కష్టం. అర్థమైన విషయాన్ని ఎవరూ మర్చిపోరు. సబ్జెక్టు మీద ఇష్టంతో, ఆసక్తితో చదివినపుడు పాఠ్యాంశాన్ని మర్చిపోయే ప్రసక్తి ఉండదు. ఇష్టమైన సినిమాలో ప్రతి దృశ్యాన్నీ ఎలా గుర్తు పెట్టుకోగలుగుతున్నాం? దానికి పెద్దగా ప్రయత్నం కూడా చేయడం లేదే? ఇది కూడా అంతే!

ఏకబిగిన గంటలతరబడి చదవకుండా 40-45 నిమిషాలకోసారి 5-10 నిమిషాల విరామం ఇస్తూ చదవటం వల్ల సబ్జెక్టును చక్కగా ఆకళింపు చేసుకోవచ్చు. బాగా గుర్తుంటుంది కూడా! బట్టీ పద్ధతిలో చదివితే ఒక పాయింట్ మధ్యలో గుర్తుకు రాకపోతే ఇక మిగిలిన పాయింట్లన్నీ కూడా దానివెనకే మాయమైపోతాయి. విద్యార్థి అయోమయంలో పడతాడు. అందుకే, ప్రతి పాఠ్యాంశాన్నీ శ్రద్ధగా ఆకళింపు చేసుకుంటే చదివినదాన్ని మర్చిపోయే సమస్య రాదు.



నిద్రలేమి

చాలామంది అర్ధరాత్రి దాటాక కూడా చదువుతూ పగలు కునికిపాట్లు పడుతుంటారు. అలాగే వివిధ పోటీపరీక్షలకు సైతం అమితంగా శ్రమించడం వల్ల తరచూ నిద్రలేమికి గురవుతుంటారు. అటువంటి సమయంలో అలసటకు లోనై ఆలోచనలు బలహీనపడతాయి. పరీక్షలు సరిగా రాయలేమేమో అని భయం కలుగుతుంది.

ఎక్కువ సమయాన్ని చదువుకోసం కేటాయించడం వల్ల నిద్రలేమి సమస్య బాధిస్తుండటం సహజమే! మరికొంత మంది ఒత్తిడి వల్ల ఎక్కువ నిద్రపోలేరు. దీనికి కనీస సమయమైనా నిద్రపోవడం తప్ప వేరే మార్గం లేదు. నిద్రలేమి ప్రభావం మానసిక, శారీరక ఆరోగ్యాల మీద తప్పకుండా పడుతుంది. కాబట్టి విద్యార్థులు వారి వయసునిబట్టి తగినన్ని గంటలపాటు నిద్రపోవాలి. ఒత్తిడితో, ఆందోళనతో నిద్ర పట్టనివారు ఒత్తిడిని జయించే కొన్ని ఎక్సర్‌సైజ్‌లు చేయడం వల్ల దీన్ని అధిగమించవచ్చు.

ప్రణాళిక లేకుండా చదవడం

ప్రణాళిక లేకుండా చదవడం వల్ల ఏ పాఠ్యాంశం మీదా పట్టుని సాధించలేక, ఏ ఒక్కదాన్నీ పూర్తి చేయలేకపోయామని పరీక్షలు సమీపిస్తున్నకొద్దీ కంగారు మొదలవుతుంది. ఆ కంగారులో మరిన్ని పొరబాట్లు చేస్తారు.

ప్రణాళికబద్ధంగా చదివితే పరీక్షలనాటికి చాలా సిలబస్‌ను రివిజన్ కూడా చేసి పరీక్షలకు సంసిద్ధంగా ఉండగలుగుతారు. చాలా మంది సులభంగా ఉండే ప్రశ్నలు లేదా లెక్కలు ముందుగా ప్రిపేరవుతూ కష్టమనుకున్నవి చివర్లో చదవొచ్చని వాయిదా వేస్తారు. కష్టమైన అధ్యాయాన్నో, అంశాన్నో చివరివరకూ అట్టిపెట్టుకుంటే ఆ సమయంలో దాన్ని సరిగా అర్థం చేసుకోలేక ఒత్తిడి పెరుగుతుంది. దాని ప్రభావం సులభమైన మిగతా పాఠ్యాంశాల మీద కూడా పడొచ్చు.

ఏ రోజు ఏ సబ్జెక్టును ఎంత పరిమాణంలో చదవాలనేది ముందుగానే నిర్దేశించుకుని పరీక్షల తేదీ రావడానికి ముందే రివిజన్ మొదలుపెట్టాలి.

రివిజన్ ప్రాధాన్యం గ్రహించకపోవడం

చాలామంది పరీక్షల సమయం ముంచుకొస్తే తప్ప రివిజన్ జోలికే వెళ్లరు. పరీక్షలు దగ్గరపడ్డాక చదవాల్సింది కొండంతగా కనబడి, భయకంపితులవుతారు.

రివిజన్‌ను కూడా ప్రణాళిక ప్రకారం చేయాల్సిందే! పాఠ్యాంశం మొత్తం మళ్లీ చదవటం కాకుండా నోట్సునూ, హైలైట్ చేసుకున్న ముఖ్యాంశాలనూ చదువుతూ వెళ్ళటమే రివిజన్ అవుతుంది. ఒక చాప్టర్‌ను చదివాక అది పూర్తిగా వచ్చేసిందన్న భరోసాతో విద్యార్థులు చాలారోజుల వరకూ దాన్ని మళ్లీ ముట్టుకోరు. వారం తరువాత దాన్ని చూస్తే.. మొత్తం మళ్లీ చదవాల్సి వస్తుంది. విద్యార్థి శ్రద్ధగా చదివిన ఒక అంశాన్ని 24 గంటల తరువాత తిరిగి చెప్పమని అడిగితే అందులో 16 శాతం మాత్రమే గుర్తుంటుందని ఓ అధ్యయనంలో తేలింది. అందుకే-

- ✤ ఏ పాఠ్యాంశమైనా మొదటిసారి చదివిన 24 గంటల లోపు మరోసారి చదవాలి.
- ✤ తర్వాత 7 రోజులకూ, 15 రోజులకూ, 30 రోజులకూ కూడా దాన్ని చదవాలి.
- ✤ ఇలా చేస్తే ఆ పాఠ్యాంశాన్ని మర్చిపోవటమనేది ఉండదు.

అందుకే రివిజన్ చార్ట్ తయారుచేసుకుని పాటిస్తుండాలి.

ముఖ్యంగా పరీక్షలు దగ్గరపడ్డాక రివిజన్‌ను ఏమాత్రం విస్మరించకూడదు.

కెరియర్ సంబంధ ఆలోచనలు

సుదూర భవిష్యత్ గురించిన ఆలోచనలు విద్యార్థులను తరచూ భయపెడుతుంటాయి. సీనియర్ ఇంటర్ విద్యార్థులకు చదువు ఒత్తిడితోపాటు భవిష్యత్తు గురించి కొంత ఆందోళన, భయాలు ఉంటాయి. ఏ ర్యాంకు వస్తే ఎలాంటి కాలేజీలో సీటు వస్తుంది, ఏ కోర్సు ఎంచుకోవాలి, దానికి ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి.. వంటి ఆలోచనలు వేధిస్తుంటాయి.

ఈ సందేహాలు తీర్చుకోవటానికి పరీక్షలకు ముందే విద్యార్థులు కెరియర్ కౌన్సెలింగ్ కార్యక్రమాలకు హాజరుకావొచ్చు. ఎప్పుడో చేయబోయే ఉద్యోగాల గురించి ఇప్పుడు అనవసర ఆందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదు. 'వంతెన దగ్గరకు చేరుకున్నాకే దాన్ని దాటాలి' అనే సూక్తిని విద్యార్థులు ఒంటబట్టించుకుంటే మంచిది.

కౌమార దశ భావోద్వేగాలు

హార్మోన్ల కారణంగా యువతీయువకుల మధ్య కలిగే పరస్పర ఆకర్షణలు చదువుమీద నుంచి ధ్యాస మళ్లడానికి చాలా వరకూ కారణమవుతాయి. కొందరైతే అటువంటి భావనలు కలగడం నైతికంగా తప్పనే అపరాధ భావనతో ఉంటారు.

టీనేజ్ దశలో పరస్పర ఆకర్షణలు సహజమే అయినా, వాటి ప్రభావంతో చదువు దెబ్బతినకుండా జాగ్రత్తపడాలి. ఎక్కువసేపు ఫోన్లలో కబుర్లతో గడపడం, ఒంటరిగా ఉండాలనిపించడం, ఊహల్లో విహరించడం.. వీటన్నిటి ప్రభావం చదువు మీద తప్పకుండా పడుతుంది. ప్రస్తుతం తమ ముందు ఉన్న ప్రాధాన్యాల్లో ముఖ్యమైనదాన్ని, సరైనదాన్ని ఎంచుకునేలా వారిని తల్లిదండ్రులూ, కౌన్సెలర్లూ ప్రభావితం చేయగలగాలి. ఆకర్షణలూ, లైంగిక భావనలూ కలగడం తప్పు కాదు కానీ ప్రస్తుతం అది విద్యార్థుల ప్రాధాన్యం కాకూడదు.

ఇష్టంలేని గ్రూప్ తీసుకుని ఉండటం

కొంతమంది విద్యార్థులు తల్లిదండ్రుల ఇష్టప్రకారం గ్రూప్ తీసుకుని, తరువాత దాంట్లో ఆసక్తిలేక చదువులో రాణించలేరు. అటువంటి సందర్భంలో వారు చదువు మీద, తరగతిలో ఏమాత్రం ఏకాగ్రత చూపించలేరు. ఫలితంగా, సబ్జెక్టు కష్టంగా ఉండటం, చదివింది గుర్తు ఉండకపోవడం, పరీక్షలు దగ్గరకు వస్తుండగానే ఉత్తీర్ణులం కాలేమనీ, తల్లిదండ్రులకు మొహం చూపించలేమనీ ఆందోళనలతో సతమతమవుతుంటారు.

ఆసక్తిలేని సబ్జెక్టును శ్రద్ధగా చదవడం ఎవరికైనా సమస్యే! గ్రూప్ తీసేసుకున్నారు. కాబట్టి శ్రద్ధగా చదివి ముందుకు నడిచి కోర్సు పూర్తిచేయడమే తక్షణ కర్తవ్యం. తమ అభిరుచుల ప్రకారం పై చదువులు చదవడానికి ఏ గ్రూప్‌లోనైనా అవకాశాలు ఉన్నాయనేది గ్రహించి భవిష్యత్తు మీద ఆశ కల్పించుకోవటం ముఖ్యం. అదే సమయంలో ఎటువంటి పైచదువులకైనా ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు తెచ్చుకోవడం అవసరమేననేది విద్యార్థులు గ్రహించాలి.

కాస్త వ్యాయామం... సానుకూలత

- కొద్దిసేపు సైక్లింగ్, చిన్నపాటి శారీరక వ్యాయామం చేయటం ఒత్తిడిని తగ్గిస్తాయి.
- బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్, పాజిటివ్ సజెషన్స్ ఇచ్చుకోవడం, ధ్యానం, అవసరమైతే వైద్యులను సంప్రదించి కొద్దిపాటి మందులు వాడుతూ ఒత్తిడి తగ్గించుకోవచ్చు.
- కొన్నిసార్లు విటమిన్ల లోపం కూడా ఒత్తిడికి కారణం కావొచ్చు. ఈ విషయంలో వైద్యుల సలహా తీసుకోవడం అవసరం.
- చుట్టూ ఉన్న పరిసరాల్లోని చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని కలిగించి ఒత్తిడిని దూరం చేసేవి చాలా ఉంటాయి. ఉదయిస్తున్న సూర్యుడు, వికసిస్తున్న పూలు, ఆడుకుంటున్న పిల్లలను చూడటం, చల్లగాలిని ఆస్వాదించడం, శ్రేయోభిలాషులతో కాసేపు మాట్లాడటం, ఆహ్లాదకరమైన సంగీతం వినడం ఇవన్నీ ఒత్తిడిని తగ్గించడానికి దోహదం చేసేవే.
- సానుకూల దృక్పథంతో ఉండాలి. ఆ దిశగా ఆలోచనలను మళ్లించాలి. ఇది ఒత్తిడిని తగ్గించడానికి అన్నింటికంటే బాగా పనిచేసే మందు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

పోస్టు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఖాళీలు: 56 (ప్రొఫెసర్-18, అసోసియేట్ ప్రొఫెసర్-20, అసిస్టెంట్ ప్రొఫెసర్-18)

అర్హత: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు ఆయా విభాగాల్లో పీహెచ్‌డీతోపాటు పరిశోధన/ బోధన రంగాల్లో అనుభవం ఉండాలి. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పీజీతోపాటు నెట్/ స్లెట్/ సెట్ లేదా పీహెచ్‌డీ ఉండాలి.

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా (వర్సిటీ ఇతర ఎంపిక ప్రక్రియలూ అనుసరించవచ్చు).

దరఖాస్తు: ఆన్‌లైన్ **ఫీజు:** రూ.1000

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 01.02.2018 నుంచి 05.03.2018 వరకు

వెబ్‌సైట్: https://www.uohyd.ac.in/

స్కాలర్‌షిప్స్

జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రిసెర్చ్, బెంగళూరు

1) ప్రాజెక్ట్ ఓరియెంటెడ్ కెమిస్ట్రీ ఎడ్యుకేషన్ (పీఓసీఈ) - 11 ఖాళీలు

అర్హత: మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు.

2) ప్రాజెక్ట్ ఓరియెంటెడ్ బయాలజీ ఎడ్యుకేషన్ (పీఓబీఈ) - 10 ఖాళీలు

అర్హత: సైన్సు సబ్జెక్టులతో బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు.

ప్రాజెక్టు కాలవ్యవధి: 6 - 8 వారాలు (ఏటా వేసవి సెలవుల్లో)

స్కాలర్‌షిప్: నెలకు రూ.6000

ప్రోగ్రామ్ ప్రత్యేకతలు: ఎంపిక చేసిన డిగ్రీ ప్రథమ సంవత్సర అభ్యర్థులకు వేసవి సెలవుల్లో శిక్షణ ఇస్తారు. స్కాలర్‌షిప్‌తోపాటు వివిధ ప్రాజెక్టులు, పరిశోధనల్లో పనిచేసే అవకాశం కల్పిస్తారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ చూపినవారికి డిగ్రీ తర్వాత ఎంఎస్ - పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశానికి ప్రాధాన్యం ఇస్తారు.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్

చివరితేది: 02.03.2018

వెబ్‌సైట్: http://jncasr.ac.in/fe/

ప్రవేశాలు

నేషనల్ ఇన్సూరెన్స్ అకాడమీ, పుణె

కోర్సు: పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం)

కాలవ్యవధి: 2 సంవత్సరాలు

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు క్యాట్/ సీమ్యాట్ స్కోరు ఉండాలి.

వయసు: 28 సంవత్సరాలు మించకూడదు.

ఎంపిక: గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్

చివరితేది: 15.03.2018

వెబ్‌సైట్: www.niapune.org.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

ఎంసెట్, జేఈఈ లేకుండా బీటెక్ చేయవచ్చా?

Q: ఎంసెట్‌గానీ, జేఈఈగానీ రాయకుండా బీటెక్ చదవడం సాధ్యమేనా?

- *శిరీష, తిమ్మసముద్రం*

జ: ఎంసెట్ కానీ, జేఈఈ కానీ రాయకుండా బీటెక్‌లో ప్రవేశం పొందడం సాధ్యమే. సదరు విశ్వవిద్యాలయంవారు నిర్వహించే వారి సొంత ప్రవేశపరీక్ష ద్వారా ప్రవేశం పొందవచ్చు. ఉదాహరణకు- వీఐటీ విశ్వవిద్యాలయం

వీఐటీఈఈఈ (వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామ్) ద్వారా, గీతం విశ్వవిద్యాలయం జీఏటీ (గీతం అడ్మిషన్ టెస్ట్), ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఎస్ఆర్ఎం జేఈఈ ద్వారా బీటెక్ కోర్సుల్లోకి ప్రవేశాలను కల్పిస్తున్నాయి. ఇవేకాకుండా కళాశాలలకు కేటాయించిన మేనేజ్‌మెంట్ కోటా సీట్ల ద్వారా కూడా బీటెక్‌లోకి ప్రవేశాన్ని పొంది, తమ విద్యను కొనసాగించవచ్చు.

- *ప్రొ. బి.రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్*

నాణ్యమైన న్యాయవిద్యకు క్లాట్!

ప్రభుత్వరంగ సంస్థల్లో న్యాయవిద్య సంబంధిత ఉద్యోగాలు పెరుగుతున్నాయి. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, పర్యావరణం తదితర చట్టాల నేపథ్యంలో న్యాయ నిపుణుల అవసరాలు కూడా ఎక్కువయ్యాయి. ఆదాయం, హోదాపరంగా ఉన్నతమైన స్థానాన్ని అందించే కెరియర్ కావడంతో యువత న్యాయవిద్య వైపు మొగ్గు చూపుతోంది. ఏ విభాగంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసినా లా చదవడానికి అర్హత లభించడం కూడా ప్రధాన ఆకర్షణగా మారింది.

దేశంలోని జాతీయస్థాయి న్యాయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందడానికి నిర్వహించే ప్రవేశపరీక్ష- క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్). దీని ప్రకటన వెలువడింది. కొచ్చిలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ ఈ ఏడాది పరీక్షను నిర్వహిస్తోంది. ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రాముల్లో సీటు లభిస్తుంది. క్లాట్ ద్వారా ప్రవేశం కల్పించే సుప్రసిద్ధ విద్యాసంస్థల్లో అత్యాధునిక కరిక్యులమ్, మౌలిక వసతులూ, అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది ఉండటం మూలంగా నాణ్యమైన విద్య లభిస్తుంది. ప్రాంగణ నియామకాలూ ఉంటాయి. క్లాట్-2018 ద్వారా తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణలో నల్సార్ (హైదరాబాద్), ఆంధ్రప్రదేశ్‌లో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (విశాఖపట్నం)లో ప్రవేశాలు పొందవచ్చు.

పరీక్ష విధానం

క్లాట్ ఆన్‌లైన్ పరీక్ష. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం నిర్వహించే ఈ పరీక్షలో 200 ప్రశ్నలు 200 మార్కులకు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. ఇంగ్లిష్ - 40, జనరల్ నాలెడ్జ్/ కరెంట్‌అఫైర్స్ - 50, ఎలిమెంటరీ మ్యాథ్స్ (న్యూమరికల్ ఎబిలిటీ) - 20, లీగల్ ఆప్టిట్యూడ్ - 50, లాజికల్ రీజనింగ్ - 40 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల కోసం నిర్వహించే పరీక్ష 150 ప్రశ్నలతో 150 మార్కులకు ఉంటుంది. లా కు సంబంధించిన మూడు విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.

రుణాత్మక మార్కులున్నాయి. తప్పుగా గుర్తించిన ప్రతి ప్రశ్నకు పావు మార్కు చొప్పున తగ్గిస్తారు. ఈ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఆలోచనాత్మక, వివరణాత్మక ప్రతిభా పాటవాలను అంచనావేస్తూ వారి అనువర్తన తీరును పరిశీలిస్తారు. గత ప్రశ్నపత్రాలను పరిశీలించి అధ్యయన ప్రణాళికలు రూపొందించుకోవాలి.

అవకాశాలు

బహుళజాతి సంస్థలూ, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులూ, ప్రైవేటు ఈక్విటీ కంపెనీలూ, కన్సల్టింగ్ సంస్థలూ, అకౌంటింగ్ కంపెనీల్లో న్యాయశాస్త్ర పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా, కార్పొరేట్ లా, సైబర్ లా, లీగల్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్‌లకు అవకాశాలు పెరుగుతున్నాయి.

గడువు తేదీ, అర్హతలు

- ● ఎల్ఎల్‌బీ 5 సంవత్సరాల (యూజీ), ఎల్ఎల్ఎం సంవత్సరం (పీజీ) కోర్సుల్లోకి ప్రవేశం.
- ● 5 సంవత్సరాల కోర్సులో చేరే విద్యార్థులు 10+2 లేదా సమాన పరీక్షను 45% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్‌సీ/ ఎస్‌టీ విద్యార్థులు 40% మార్కులతో పాసై ఉండాలి. చివరి సంవత్సరం పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు కూడా క్లాట్ రాయవచ్చు.
- ● ఎల్ఎల్ఎం కోర్సులో చేరదల్చినవారు ఎల్ఎల్‌బీ పరీక్షను 55% మార్కులతో; ఎస్‌సీ, ఎస్‌టీవారు 50% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సరం పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు కూడా క్లాట్ రాసుకోవచ్చు.
- ● అభ్యర్థుల వయసుకు సంబంధించి పరిమితులు లేవు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 31.03.2018.

ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.4000; ఎస్సీ, ఎస్టీలకు రూ.3500. **ఆన్‌లైన్ పరీక్ష తేది:** 13.05.2018

క్లాట్-2018 పూర్తి వివరాలకు www.clat.ac.in చూడవచ్చు.

ప్రవేశాలు కల్పించే సంస్థలు ఇవే!

క్లాట్ ర్యాంకు ఆధారంగా 19 ప్రఖ్యాత న్యాయశాస్త్ర విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.

◆ నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ, బెంగళూరు (ఎన్ఎల్ఎస్ఐయూ) ◆ నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రిసెర్చ్ యూనివర్సిటీ ఆఫ్ లా, హైదరాబాద్ (నల్సార్) ◆ ద నేషనల్‌లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ, భోపాల్ (ఎన్ఎల్ఐయూ) ◆ ద వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జూరిడికల్ సైన్సెస్, కోల్‌కతా (డబ్ల్యూబీఎన్‌యూజేఎస్) ◆ నేషనల్ లా యూనివర్సిటీ, జోధ్‌పూర్ (ఎన్ఎల్‌యూజే) ◆ హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ, రాయ్‌పూర్ (హెచ్ఎన్ఎల్‌యూ) ◆ గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ, గాంధీనగర్ (జీఎన్ఎల్‌యూ)

◆ డా.రామ్‌మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ, లఖ్‌నవూ (ఆర్ఎంఎల్ఎన్ఎల్‌యూ) ◆ రాజీవ్‌గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా, పంజాబ్ (ఆర్‌జీఎన్‌యూఎల్) ◆ చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ, పట్నా (సీఎన్ఎల్‌యూ) ◆ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్, కొచ్చి (ఎన్‌యూఏఎల్ఎస్) ◆ నేషనల్ లా యూనివర్సిటీ ఒడిశా, కటక్ (ఎన్ఎల్‌యూఓ)

◆ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రిసెర్చ్ ఇన్ లా, రాంచీ (ఎన్‌యూఎస్ఆర్ఎల్) ◆ నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జ్యుడిషియల్ అకాడమీ, అసోం (ఎన్ఎల్‌యూజేఏఏ) ◆ దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ, విశాఖపట్నం (డీఎస్ఎన్ఎల్‌యూ) ◆ తమిళనాడు నేషనల్ లా స్కూల్, తిరుచిరాపల్లి (టీఎన్ఎన్ఎల్ఎస్) ◆ మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ, ముంబయి (ఎంఎన్ఎల్‌యూ) ◆ మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ, నాగ్‌పూర్ (ఎంఎన్ఎల్‌యూ) ◆ మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ, ఔరంగాబాద్ (ఎంఎన్ఎల్‌యూ)

వీటితోపాటు పలు ప్రైవేటు సంస్థలు క్లాట్ స్కోర్‌తో న్యాయవిద్యలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.